క్లుప్తంగా

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న విద్య జానకీరామన్

బోట్‌క్లబ్: సరస్వతీగాన సభ 120వ దసరా సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన విద్య జానకీరామన్ శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి కళారాధకులను ఎంతగానో ఆకట్టుకుంది. పూర్వ కల్యాణి రాగంలో జ్ఞానమొసగరాద, తోడి రాగంలోని కద్దను వారికి తదితర కీర్తనలు ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. వయోలిన్‌పై దుర్గాభవానీ, మృందగంపై మహాదాసు ఏడుకొండలు, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాద్య సహకారాన్ని అందించారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాకినాడ సిటీ: ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం నుంచి నిర్వహించే నిరవధిక దీక్షలు విజయవంతం చేయాలని కోరుతూ యూటీఎఫ్ పోస్టర్లు ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగే నిరవధిక దీక్ష విజయవంతం నాయకులు పిలుపు నిచ్చారు. 18న రాష్ట్ర కేంద్రంలోనూ, 19న కాకినాడ యూటీఎఫ్ హోమ్‌లో, 20వ తేదీ నుంచి డివిజన్ కేంద్రాల్లోను నిరవధిక దీక్షలు చేపడతామని యూటీఎఫ్ నాయకులు తోటకూర చక్రవర్తి, అన్నా రాము తెలిపారు.

టీచర్స్ కాలనీ పార్కు ప్రారంభం

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాయుడుపాలెం టీచర్స్ కాలనీలో అభివృద్ధి చేసిన పార్కును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కాలనీ వాసులు చిరకాల కోరికైన ఈ పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువచ్చామని, చిన్నారులకు ఆట విడుపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మండల ఇంజినీర్ వాసుదేవరావు, గంజా సత్తిబాబు, జంగా గగారిన్, నాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమణయ్యపేటలో పలు డ్రైనేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

కొత్తూరులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కాకినాడ రూరల్: రాయుడుపాలెం కొత్తూరులోలో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. విద్యుత్ వినియోగం పెరడం, కొత్తగా ఇళ్ల నిర్మాణాతో లో ఓల్టేజీ సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే కన్నబాబుకు స్థానికులు సమస్య వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. మంగళవారం టీచర్స్ కాలనీలో పర్యటించిన ఆయనకు విద్యుత్ శాఖ ఏఈ గౌతు రాజు, లైన్‌మన్ వాసు, స్థానికులు ఈ విషయాన్ని చెప్పగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.

రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శాస్త్రి బాధ్యతల స్వీకరణ



ఏపీఎన్‌జీఓ రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న సంఘ అధ్యక్షుడు శాస్త్రి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పీఎస్ఎన్‌పీ శాస్త్రి నూతన అధ్యక్షుడిగా విజయవాడ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారని జిల్లా సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుని కలసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వివరించినట్టు ఆయన తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈహెచ్‌ఎస్ సమావేశానికి హాజరయ్యే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పద్మనాభం తెలిపారు. సంఘ కోశాధికారి ఇబ్రహీం, రాష్ట్ర కార్యదర్శి సాజిదా, సంఘ సభ్యులు శేషగిరి, కొప్పర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ట్రెజరీల డైరెక్టర్ మోహన్ రావును కూడా శాస్త్రి కలసి పలు సమస్యలపై చర్చించినట్టు పద్మనాభం తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్లకు పుట్టిన తేదీ రికార్డులో లేకపోవడం వల్ల అడిషనల్ క్వాంటమ్ రావడం లేదని వివరించినట్టు ఆయన తెలిపారు.

బస్సును ఢీకొని ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం: కాకినాడలో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు. అతి వేగంతో ద్విచక్ర వాహనాన్ని నడిపి బస్సును ఢీకొట్టి ఆసుపత్రి పాలయ్యారు. కాకినాడకు చెందిన రెడ్డి, ప్రకాష్ అనే 19 ఏళ్ల ఇద్దరు విద్యార్థులు స్థానిక పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి కేటీఎం బైక్‌పై అతి వేగంగా వెళుతూ తెలుగు తల్లి విగ్రహం సమీపంలో రామచంద్రపురం వెళుతున్న ఆర్‌టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కేటీఎం బైకు పూర్తిగా దెబ్బతినగా బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. విద్యార్థులిద్దరూ గాయాలపాలై ఆసుపత్రిలో చేరారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బహురూపిణీ భవానీ..

- దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఆలయాల్లో భక్తుల పూజలు, అభిషేకాలు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి అమ్మవారు పుస్తకపాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉచిత దర్శనానికి గంటకు పైగా భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. దాతల సహకారంతో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. గాయత్రి గాన మంజరి వారి కీర్తనలు, బాలరాజరాజేశ్వరి నృత్య నికేతన్ వారి కూచిపూడి నృత్యం, బేత వెంకట్రావు బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించాయి. అనంతరం వారణాసి శ్రీకృష్ణ రాఘవ వయోలిన్ కచేరి భక్తులు ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. కోరుకొండ జగజ్జనీరావు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి నవావరణార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయంలో పండితులు ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. మాధవనగర్‌లోని కనక దుర్గ అమ్మవారు చంద్ర ఘంటిక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక భానుగుడి భాను లింగేశ్వరస్వామి ఆలయంలోని ఉషా రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కామాక్షి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి పూజా సామగ్రి ఉచితంగా అందించారు.

శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అమ్మవారి దయ అందరిపై ఉండాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గమ్మ వారిని ఆయన మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి ఆయనకు ఘన స్వాగతం పలికారు.



శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ప్రసాద్, రమణయ్యపేట వైఎస్సార్ సీసీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కరప: మండల గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అర్చకులు కొంపెల్ల చక్రధర్ కరప దుర్గాదేవి ఆలయంలో పూజలు, కుంకుమార్చనలు చేశారు. కరపలోని శివాలయంలో ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ పర్వతవర్ధనీదేవిని పుస్తకపాణిగా అలంకరించి పూజలు చేశారు. కరప మార్కెట్‌యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్, గ్రామస్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం పంచారు. కరప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు దుర్గమ్మను నిలిపి, అమ్మవారిని చంద్రఘంటాదేవిగా అలంకరించారు. తమిళనాడులోని స్కందపీఠాధిపతి శివానందస్వామీజీ, సురేష్‌శర్మ, అజిత్‌శర్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

హరిద్రాదేవిగా ఐశ్వర్యాంబిక

కాకినాడ రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు మంగళవారం హరిద్రాదేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారి అలంకరణ అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు.



కరపలో చంద్రఘంటాదేవిని దర్శించుకున్న స్కంద పీఠాధిపతి శివానంద స్వామీజీ తదితరులు



సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలోని బాలాత్రిపుర సుందరి



కరప శివాలయంలో పుస్తకపాణిగా పర్వత వర్ధినీదేవి



పుస్తకపాణిగా దర్శనమిచ్చిన సూర్యారావుపేట బాలత్రిపుర సుందరి



హరిద్రాదేవిగా శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక

మెరుగైన వైద్య సేవలకే సురక్ష శిబిరాలు

కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక సీతారామనగర్ యూపీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కమిషనర్ సందర్శించారు. నాలుగో డివిజన్‌కు సంబంధించి సుమారు 336 మంది వివిధ వైద్య శిబిరానికి విచ్చేశారు. వారికి వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. ప్రజలు సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్, వైద్యాధికారి అశ్విత, మాజీ కార్పొరేటర్ పలకా సూర్యకుమారి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య సేవలపై ఆరాతీస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

వలసపాకలలో సురక్ష శిబిరం

కాకినాడ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోందని జిల్లా పరిషత్ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని వలసపాకలలో సచివాలయం – 2 వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఈఓ పీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి బీబీ తదితరులతో కలిసి పరిశీలించారు. పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆయేషా ఫాతిమాతో కలసి మందులు, కేస్ షీట్‌లను ఆయన పంపిణీ చేశారు.



రోగికి మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైద్యులు

నడకుదురులో..

కరప: నడకుదురులోని సచివాలయం–2 పరిధిలో మంగళవారం సర్పంచ్ డేగల లలితకుమారి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు హాజరై శిబిరాన్ని పరిశీలించారు. 352 మందికి మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ, డాక్టర్ ఎంకే సౌజన్య వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు, నాయకులు పేషంట్లకు మందుల కిట్లను అందజేశారు. రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పైలా గోవిందు, ముమ్మిడి బుచ్చిబాబు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

27న ఓటర్ల ముసాయిదా జాబితా

- ఆ తర్వాత అభ్యంతరాల స్వీకరణ
- రాజకీయ పార్టీలతో కమిషనర్ సమావేశం

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అక్టోబర్ 27న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం షెడ్యూల్ ప్రకారం అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. 2023 ఏప్రిల్ 15వ తేదీ తరువాత ఇప్పటి వరకు ఫారం 6, 7, 8 ద్వారా 75,581 దరఖాస్తులు రాగా 6643 తిరస్కరించామని, సుమారు 50 వేల దరఖాస్తులు పరిష్కరించామన్నారు. మరో 18,532 దరఖాస్తులు విచారణలో ఉన్నాయని కమిషనర్ చెప్పారు. ఓటర్లకు దూరంగా ఉన్న, శిథిలావస్థకు చేరిన 47 పోలింగ్ కేంద్రాలను అదే ప్రాంగణం లేదా దగ్గరలోని భవనాలకు మారుస్తామన్నారు. పరిష్కరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి ఎంజీకే కిశోర్, టీడీపీ ప్రతినిధులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈఆర్‌ఓలతో సమావేశం

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు, వీఆర్వోలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆచూకీ లేని (నాన్ ట్రేస్డ్) ఓటర్లకు సంబంధించి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపిన నోటీసులు, తిరిగి వెనక్కి వచ్చిన నోటీసులపై కమిషనర్ సమీక్షించారు. వెనక్కి వచ్చిన దరఖాస్తులను ఆయా బీఎల్‌వోలు, వీఆర్వోల ద్వారా మరోసారి నిర్ధారించుకుని తక్షణమే వాటి వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈఆర్‌వోలు కోన శ్రీనివాస్, ఎంవీ మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు, వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నాగ నరసింహారావు

సంస్కృత అధ్యాపకుడికి జాతీయ విశిష్ట సాహితీ పురస్కారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తున్న యడ్ల బుజ్జికి జాతీయ విశిష్ట సాహితీ పురస్కారం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మంగళవారం తెలిపారు. చిత్తూరు జిల్లా బాకరాపేటలోని ఉషోదయా ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో బుజ్జి పాల్గొని మృదు మధురంగా కవితాగానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బుజ్జిని అభినందించారు.

దసరా సెలవుల్లో సరదాగా..

- విజ్ఞాన శిబిరాలకు గ్రంథాలయాలు సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహణ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేలా దసరా సెలవుల్లో ప్రత్యేక శిబిరాల నిర్వహణకు గ్రంథాలయ సంస్థ ఏర్పాట్లు చేసింది. పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 24వ తేది వరకూ దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో 10 రోజుల పాటు గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకూ ఈ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అధికారి గ్రంథాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై 10 రోజులు శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు.

- నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు గాంధీనగర్ కుళాయిచెరువు పార్కు, ఆనంద భారతి గ్రౌండ్, జగన్నాథపురంతో పాటు మరో 6 బీడీసీ (పుస్తక నిక్షిప్త కేంద్రాలు) ఉన్నాయి.
- పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, అలాగే విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. రోటరీ, లయన్స్, స్వచ్ఛంద సేవా సంస్థలు, జన విజ్ఞాన వేదిక సభ్యులు, పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

రోజు వారీ షెడ్యూల్ ఇదే...

- ఉదయం 8 నుంచి 8.30 నిముషాలు.. కథలు వినడం, (వినికిడి జ్ఞానం పెంపొందించడం)
- 8.30 నుంచి 10 గంటల వరకూ.. గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం (చదువంటే మాకిష్టం)
- 10 గంటల నుంచి 10.10 వరకూ విరామం. 10.10 నిముషాల నుంచి 10.30 వరకూ పుస్తక సమీక్ష. 10.30 నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం. 11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర విభాగాల అంశాలు ఉంటాయి.

స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు పండితుల నుంచి మంచి ప్రతిభ ఉన్న వారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ఆ సంస్థ అవకాశం కల్పిస్తోంది.



పాఠశాలలకు సమాచారం ఇచ్చాం..

పాఠశాలలకు ముందుగానే సమాచారం ఇచ్చాం. వారికి అందుబాటులో ఉన్న గ్రంథాలయాలకు వచ్చేలా మా సిబ్బందికి సూచనలు జారీచేశాం. సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి నిత్యం శిక్షణకు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. ఆసక్తి గల ఉపాధ్యాయులు, చిత్రలేఖనం, వృత్తి శిక్షణ చేసిన వారు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సమయం కేటాయించేందుకు ముందుకురావాలి.

– వీఎల్ఎస్‌ఎస్‌వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

విద్యార్థులను ప్రోత్సహించాలి



వీసీ పద్మరాజుకు చెక్కును అందిస్తున్న శ్యామ్

బోట్‌క్లబ్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌కు కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.తణుకులు(శ్యామ్) వీసీ కె.పద్మరాజును కలిసి రూ.లక్ష విలువైన ఎండోమెంట్ చెక్కును మంగళవారం అందజేశారు. వీసీ మాట్లాడుతూ కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ పూర్వ విద్యార్థి శ్యామ్ అందజేసిన రూ.లక్షకు వచ్చే వడ్డీని సదరు క్యాంపస్ ఎంబీఏ మొదటి సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ఏటా బహుమతిగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎండోమెంట్ ఫండ్ ఇచ్చినట్లు చెప్పారు. శ్యామ్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ ఐ.దోసగిరిరావు, కాకినాడ క్యాంపస్ ఇన్‌చార్జి ఎస్.ప్రశాంతి అభినందించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు కాకినాడ క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులతో యోగా గురువు చిట్టిబాబు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): భీమవరంలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో కాకినాడ క్రీడాకారుల ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఏపీ రాష్ట్ర యోగా విద్యాపీఠం అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు తెలిపారు. యోగా అథ్లెట్ బొజ్జ లక్ష్మీ వెంకటసాయి బంగారు పతకం, బీవీఎస్ సాయిరాం రజత, జి.లహరి కాంస్య పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నవంబరులో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యోగా కోచ్ ధర్మాడి శాంతాప్రసాద్, యోగా అథ్లెట్ మహ్మద్ యాసిన్, యోగా విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతన సవరణ చేయాలి

కాకినాడ సిటీ: షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతన సవరణ చేయాలని ఈఎస్ఐ పీఎఫ్‌లో జరుగుతున్న మోసాలపై చర్యలు తీసుకోవాలని ఏఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం పిలుపునిచ్చింది. మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏఎఫ్‌టీయూ నాయకులు డి.నారాయణమూర్తి, బొత్స యేసు, రంబాల సతీష్ పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ధర్నా

కాకినాడ సిటీ: పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా, గాజాపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిని అడ్డు పెట్టుకుని గాజాపైన, పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ దాడులు చేయడం గర్హనీయమన్నారు. పార్టీ నాయకులు జె.వెంకటేశ్వర్లు, మల్లవరపు రాజు, బొడ్డు సత్యనారాయణమూర్తి తదతరులు పాల్గొన్నారు.